# ఎన్ఆర్ఐ సమాచారం

(ఎన్ఆర్ఐలకు ప్రత్యేకం)



## డాలస్‌లో మహాత్మాగాంధీకి ఘన నివాళి

డాలస్, టెక్సాస్: ఎంతోమంది ప్రవాస భారతీయులు డాలస్ (ఇర్వింగ్)లో ఉన్న మహాత్మాగాంధీ మెమోరియల్‌ను సందర్శించి, జాతిపిత 70వ వర్ధంతిని పురస్కరించుకుని గాంధీ పాదాల వద్ద పుష్పాలను ఉంచి ఘన నివాళి అర్పించారు. ఎస్ పి నాగ్రాత్ అనే స్థానిక గాయకుడు గాంధీజీకి ఇష్టమైన రఘుపతి రాఘవ రాజారామ్ కీర్తనను ఆలపించారు.

మహాత్మాగాంధీ మెమోరియల్ ఆఫ్ నార్త్ టెక్సాస్ కార్యదర్శి రావు కల్వల మాట్లాడుతూ– స్థానిక ప్రజల సహకారంతో అతి పెద్ద గాంధీ మెమోరియల్‌ను ఇక్కడ నిర్మించుకోవడం, భావితరాలకు స్ఫూర్తిదాయకంగా చూపడానికి అవకాశం కలిగిందని, గాంధీజీ సేవలను స్మరించుకోవడానికి వచ్చిన వారందరికీ ధన్యవాదాలు తెలియజేశారు.

గాంధీ మెమోరియల్ ఛైర్మన్ డాక్టర్ ప్రసాద్ తోటకూర మాట్లాడుతూ– గాంధీజీ 70 సంవత్సరాల క్రితం మరణించినప్పటికీ ఆయన సిద్ధాంతాలు, ఆశయాలతో మనందరి మధ్య ఎప్పటికీ సజీవంగానే ఉంటారని అన్నారు. దేశ స్వాతంత్ర సమపార్జనలో దాదాపు 32 సంవత్సరాల తన జీవతాన్ని అంకితం చేసి లక్షలాది ప్రజలను నిరంతరం చైతన్య పరచి, అహింసా మార్గం ద్వారా దేశానికి స్వాతంత్రం సాధించిన తీరు అనితర సాధ్యం అని, ప్రవాస భారతీయులుగా మనమందరం గాంధీ చూపిన బాటలో పయనిస్తూ సమానత్వం, సామాజిక న్యాయం ఉండే ఒక మంచి సమాజ స్థాపనకు అందరూ కృషి చేయాలని అన్నారు.

గాంధీ మెమోరియల్ బోర్డు ఆఫ్ డైరెక్టర్ కమల్ కౌశల్ గాంధీజీ విశ్వ మానవాళికి ఒక ఆదర్శప్రాయమైన వ్యక్తి అని, ఆయన సిద్ధాంతాలతో ప్రపంచ వ్యాప్తంగా ఎంతోమంది ఉత్తేజితులయ్యారని అన్నారు.

ఐఏఎన్టి ఉపాధ్యక్షులు బివెన్ మాట్లాడుతూ– గాంధీజీ శాంతి, సహనానికి ప్రతి రూపమని, ఆయన గురించి ముఖ్యంగా యువతరం ఎంతో తెలుసుకొని తమ భవిష్యత్తును తీర్చుదిద్దుకోవచ్చని చెప్పారు.

మహాత్మాగాంధీ మెమోరియల్ బోర్డు ఆఫ్ డైరెక్టర్ షబ్నమ్ మోడ్గిల్ గాంధీజీ తన సాధారణ, పారదర్శక జీవితంతో ఎంతోమందికి ఆదర్శప్రాయులయ్యారని, ఆయనకు మరణం లేదని ఎన్ని దశాబ్దాలైనా అందరూ జాతిపితను గుర్తించుకుంటారని చెప్పారు.

## అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ అమెరికా 2018 నూతన కార్యవర్గం

అక్కినేని నాగేశ్వరరావు గారి అభిమానులు కొంతమంది కలిసి 2014 లో అమెరికాలో స్థాపించిన లాభాపేక్షరహిత సంస్థ అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ అమెరికా (ఏ.ఎఫ్.ఏ). ఈ బోర్డు సభ్యులు అక్కినేని నాల్గవ వర్ధంతి సందర్భంగా అమెరికాలో సమావేశమై 2018వ సంవత్సరానికి గాను నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లుగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డా.ప్రసాద్ తోటకూర ఒక ప్రకటనలో తెలియజేశారు.

### నూతన కార్యవర్గం

వ్యవస్థాపక అధ్యక్షులుగా డా.ప్రసాద్ తోటకూర, అధ్యక్షులుగా రావు కల్వల, ఉపాధ్యక్షులుగా శారద ఆకునూరి, కార్య దర్శిగా చలపతి రావు కొండ్రకుంట ఎన్నికయ్యారు. **బోర్డు సభ్యులు :** రవి కొండబోలు, ధామ భక్తవత్సలు, డా.సి.ఆర్.రావు, మురళి వెన్నం, డా.ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి.

సమావేశంలో డా.ఏ.ఎన్.ఆర్‌తో వ్యక్తిగతంగా తమకున్న అనుబంధాల్ని, అనుభవాల్ని బోర్డు సభ్యులు నెమరవేసుకున్నారు. ముఖ్యంగా 2012లో డా.అక్కినేని నాగేశ్వర రావుగారు అమెరికాలో జరిపిన చివరి పర్యటన, డాలస్ నగరంలోఅత్యంత వైభవంగా 89వ జన్మదిన వేడుకలను, ఆయన పట్ల ప్రజలు చూపిన అభిమానాన్ని గుర్తుచేసుకున్నారు.

"అక్కినేని 5వ అంతర్జాతీయ పురస్కార వేడుక"లను ఈ సంవత్సరం డిసెంబర్ 22న కరీంనగర్ నగరంలో జరుపనున్నట్లు అక్కినేని ఫౌండేషన్ అఫ్ అమెరికా వ్యవస్థాపక అధ్యక్షులు డా.ప్రసాద్ తోటకూర మరియు కొత్తగా ఎన్నికైన అధ్యక్షులు రావు కల్వల వెల్లడించారు. ★